

ఎపిపిఎస్‌సి పరీక్షకు 612 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో శనివారం జరిగిన ఎపిపిఎస్‌సి పరీక్షకు 612 మంది హాజరయ్యారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని లూథర్‌గిరి వద్ద రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల ప్రాంగణంలో గల అయాన్ డిజిటల్ జోన్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల పోస్టుల భర్తీకి ఎపిపిఎస్‌సి ఈ పరీక్షను నిర్వహించిందని తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణను డిఆర్ఒ జి.నరసింహులు వ్యక్తిగతంగా పర్యవేక్షించారని తెలిపారు. 960 మందికి పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్షకు 612 హాజరయ్యారని పేర్కొన్నారు. 348 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. ఇద్దరు అభ్యర్థులకు లేఖరి సదుపాయం కల్పించి అదనపు సమయం కేటాయించినట్లు తెలిపారు.

కౌంటింగ్‌కు చురుగ్గా ఏర్పాట్లు

నియోజకవర్గాల వారీగా టేబుల్స్ ఏర్పాటు
కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత
కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -రాజానగరం

కౌంటింగ్‌కు సంబంధించి నియోజకవర్గాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శనివారం ఆమె నన్నయ్య యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జూన్ 4న జరిగే పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కోసం చురుగ్గా ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్‌లకు 14 చొప్పున, పరిశీలకులకి, పోస్టల్, ఇటిపిబిఎస్‌ల కోసం 129 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ పరిశీలకుల కోసం ఒక టేబుల్ ఏర్పాటు చేస్తున్నామనాౖ.

పార్లమెంటు నియోజక అభ్యర్థులకు పోలైన ఓట్లను అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా కేటాయించిన బ్లాక్‌లలో లెక్కించనున్నట్లు తెలిపారు. పార్లమెంటు నియోజక వర్గాల పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను యూనివర్ సెంట్రల్ పరిపాలన భవనం రెండో అంతస్తులో 14 టేబుల్స్ ద్వారా, ఇటిపిబిఎస్ ఓట్లను 4 టేబుల్స్ ద్వారా లెక్కించనునట్లు తెలిపారు. అసెంబ్లి నియోజక వర్గాల వారీగా పోలైన ఓట్లు, పార్లమెంటు నియోజక వర్గాల ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లు లెక్కింపు ఏర్పాట్ల వివరాలను తెలియజేశారు.

అనపర్తి అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లు ఎన్-బ్లాక్‌లో, పార్లమెంటు సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు రూమ్ నెంబర్ 215, 216లో(14 టేబుల్స్), అసెంబ్లీ సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు 218, 218ఎ(14 టేబుల్స్) , పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు (2 టేబుల్స్) కేటాయించామన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం అసెంబ్లీకి ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లు ఇంజినీరింగ్ వర్క్ షాప్ భవనం దిగువ అంతస్తులో, పార్లమెంటు సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు(14టేబుల్స్), అసెంబ్లీ సిగ్మెంట్ మొదటి అంతస్తులో ఇవిఎం ఓట్లు(14 టేబుల్స్), పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొదటి అంతస్తులో 4 టేబుల్స్‌లో లెక్కిస్తారన్నారు.

రాజమండ్రి సిటీ అసెంబ్లీకి సంబంధించి ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లు ఎన్-బ్లాక్ ఈస్ట్ వింగ్‌లో పార్లమెంటు సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు రూమ్ నెంబర్ 317(14 టేబుల్స్), అసెంబ్లీ సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు రూమ్ నంబర్ 320, 321లలో (14టేబుల్స్)పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రూమ్ 319లో(6 టేబుల్స్)లో లెక్కిస్తారన్నారు.

రాజమండ్రి రూరల్ అసెంబ్లీకి సంబంధించి ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లు ఎన్-బ్లాక్ లో పార్లమెంటు సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు రూమ్ నెంబర్ 119(14టేబుల్స్), అసెంబ్లీ సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు 111, 112 రూమ్స్‌లో (14 టేబుల్స్), పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 113 రూమ్‌లో(5 టేబుల్స్) లెక్కిస్తారన్నారు.

కొవ్వూరు అసెంబ్లీకి సంబంధించి ఎన్-బ్లాక్ 2వ అంతస్తులో పార్లమెంటు సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు రూమ్ నెంబర్ 314లో(14 టేబుల్స్) , అసెంబ్లీ సిగ్మెంట్ రూమ్స్ 315, 316లలో ఇవిఎం ఓట్లు(14 టేబుల్స్), పోస్టల్ బ్యాలెట్ ఓట్లు(4 టేబుల్స్)లో లెక్కిస్తారన్నారు.

నిడదవోలు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్ దిగువ అంతస్తులో పార్లమెంటు సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు రూమ్ నెంబర్ సిసి 101/ఎలో (14 టేబుల్స్), అసెంబ్లీ సిగ్మెంట్ ఇవిఎం ఓట్లు సీసీ 108/ఎ(14 టేబుల్స్), పోస్టల్ బ్యాలెట్ ఓట్లు (3 టేబుల్స్)లో లెక్కిస్తారు.

గోపాలపురం అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో ఇవిఎంల ద్వారా పోలైన ఓట్లు ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్ మొదటి అంతస్తులో, పార్లమెంటు సిగ్మెంట్ ఇవిఎంల ఓట్లుఉత్తరం వైపు కాన్ఫరెన్స్ హాలులో(14 టేబుల్స్), అసెంబ్లీ సిగ్మెంట్ దక్షిణం వైపు కాన్ఫరెన్స్ హాలులో ఇవిఎం ఓట్లు(14 టేబుల్స్), పోస్టల్ బ్యాలెట్ ఓట్లు(2 టేబుల్స్)లో లెక్కిస్తారు.

కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, డిటి సునీల్‌కుమార్ తదితరులున్నారు.

రాజులోవ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి- రౌతులపూడి



సిఐటియు తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మృతికి సిపిఎం సంతాపం తెలిపింది. రౌతులపూడి మండలం రామకృష్ణపురంలో రాజులోవ శనివారం హఠాన్మరణం పొందారు. విషయం తెలుసుకున్న సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బొప్పిన కిరణ్ రామకృష్ణాపురంలోని రాజులోవ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జి, సిహెచ్.రాజ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెఎస్.శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు ప్రభాకర్‌వర్మ, సత్తిరాజు, సిఐటియు నాయకులు ఎస్-ఎస్.మూర్తి, సుందరబాబు, కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయులు లోతా రాంబాబు, ఐద్వా నాయకులు సిహెచ్.రమణి, యుటిఎఫ్ నాయకులు ఎ.షరీఫ్, పి.జయకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్.రాజా, గంగసూరిబాబు, వరహాలు తదితరులు రాజులోవకు నివాళులిర్పంచారు.

ఎస్ఎఫ్ఐ కీలక నాయకునిగా...

రౌతులపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బి.రాజులోవ ఉన్నత విద్య కోసం పెద్దాపురం మహారాణి కళాశాలలో చేరారు. అప్పటి నుంచి ఎస్ఎఫ్ఐ పట్ల ఆకర్షితులయ్యారు. ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థుల సమస్యలపై నిర్వహించిన పలుపోరాటాల్లో పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షునిగానూ సేవలందించారు. జిల్లాల విభజన అనంతరం రాజమండ్రి పౌర సంక్షేమ సంఘం బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం సిఐటియు తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జిల్లాలో జరిగిన పలు కార్మికుల ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. ఆయన మృతితో స్వగ్రామం రామకృష్ణాపురంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్నేహితులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

కృష్ణబాబు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

కొవ్వూరు మాజీ ఎంఎల్ఎ పెండ్యాల వెంకటకృష్ణారావు(కృష్ణబాబు) మృతికి పలువురు సంతాపం తెలిపారు. పలువురు ప్రముఖులు పార్టీలకు అతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుత రామయ్యతోపాటు, రంగబాబు, కృష్ణబాబు కుమారుడు రవిబాబు, అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం అనపర్తి ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంఎల్ఎలు రౌతు సూర్యప్రకాశరావు, పసల కనక సుందరరావు, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, వ్యాపార వేత్త చెరుకూరి వీర్రాజు, విద్యాసంస్థల అధినేత కరిబంటి గన్నిరాజు, తాడేపల్లిగూడెం ఉమ్మడి కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, రాజమండ్రి టిడిపి నాయకులు గన్ని కృష్ణ పలువురు టిడిపి నాయకులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.



కృష్ణబాబుకు నివాళులర్పిస్తున్న నాయకులు

'ఆసరా' అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి - పెరవలి

మండలం కానూరు గ్రామంలో ఆసరా సొమ్ములు అవకతవకలపై సర్పంచ్ భావన మధుపూర్ణచంద్ ఆధ్వర్యంలో ఎపిఎం నాగరాజు క్షేత్రస్థాయిలో శనివారం విచారణ చేశారు. గ్రామ పరిధిలో నాలుగు డ్వాక్రా గ్రామ సంఘాలు ఉండగా గ్రామ సంఘం మూడులో ఆసరా సొమ్ము 8 మహిళ సంఘాలలో 14 మంది సభ్యులు లబ్ధిదారులు ఖాతాలో జమ చేయకుండా రూ.1.58 లక్షలు కొంత సొమ్ము సంఘాల లీడర్ల వద్ద, మరి కొంత సొమ్ము గ్రామ సంఘం అధ్యక్షురాలు ఖాతాలో జమైనట్లు ఎపిఎం తెలిపారు. సోమవారం యూనియన్ బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా లబ్ధిదారులకు చెందిన బ్యాంక్ ఖాతాలో జమచేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నియోజవర్గ నాయకుడు వెన్నపు సుధాకర్, డ్వాక్రా మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న ఎపిఎం

12వ రోజుకు వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - పెరవలి

మండలం ముక్కామల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శనివారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా నీతి కథలు చెప్పడం, చెస్, క్యారమ్స్ వంటి ఆటలు విద్యార్థులతో ఆడించారు. స్వాతంత్ర సమరయోధులు మహాత్మా గాంధీ జీవిత చరిత్రను వివరించారు. వారికి ఇష్టమైన కథల పుస్తకాల చదివించారు. వేమన పద్యాలు, స్పోకెన్ ఇంగ్లీష్, డాన్స్, యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ కె.విశ్వనాథం, కె.కామేశ్వరరావు, కె.భవాని, మధులీల, గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్లంపై శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్ వెర్బ్స్, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని గ్రంథాలయ నిర్వాహకులు గుత్తికొండ కృష్ణారావు తెలిపారు. ఇంగ్లీషులో మాట్లాడటం నేర్పించామన్నారు. వారికి వచ్చిన అనుమానాలను నివృత్తి చేశారని ఆయన తెలిపారు. మోర్త పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.వెంకట కృష్ణప్రసాద్, గ్రంథాలయ రిసోర్స్ పర్సన్ పి.రాందాస్ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, పాఠకులు పాల్గొన్నారు.

నాడు -నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో నాడు-నేడు ఫేజ్-2 పనులపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. నాడు-నేడు ఫేజ్-2లో ఆదనపు తరగతి గదులు, అంగన్‌వాడీల నిమిత్తం ఎంత మొత్తం మంజూరైంది, ఎన్ని కంపోనెంట్స్‌కు మంజూరైంది? ఇంతవరకు ఎంత అమౌంట్ ఖాతాలో జమ అయ్యింది అనేవాటిపై ఆరా తీశారు. ఎన్ని కంపోనెంట్స్ పూర్తఅయ్యాయి, ఏయే పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎంత అమౌంట్ రావాల్సి ఉంది, పనులు పూర్తి అయితే ఎంత సొమ్ము బ్యాలెన్స్ ఉంది అనే వివరాలు సేకరించారు. ప్రధానోపాధ్యాయుని స్థాయిలో పూర్తి చేయవలసిన కంపోనెంట్స్ అన్నీ పూర్తి చేసేసారా, యాప్‌లో పూర్తి చేసిన కంపోనెంట్స్ క్లోజ్ చేసేరా? కంపోనెంట్స్ పూర్తి చేసి యాప్‌లో క్లోజ్ చేయక పోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఖర్చు చేసిన ప్రతి అమౌంట్ తాలూకు బిల్స్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. బిల్స్ యాప్‌లో అప్‌లోడ్ చేయకపోవడానికి కారణాలపై ఆరా తీశారు. వాటి వివరాలను తెలుసుకున్నారు. ఇలా ప్రతి అంశంపై ప్రధానోపాధ్యాయుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఖాతాలో నిధులు ఉండి పనులు చేయక పోతే తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర పాలక సంస్థ ఇఇ శేషగిరిరావు ప్రధానోపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఇఒ-2 రమా రజని, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఐ దిలీప్‌కుమార్

కౌంటింగ్ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

సమీక్షా సమావేశంలో జెసి తేజ్‌భరత్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జెసి ఎన్.తేజ్‌భరత్ సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రూరల్ నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియపై కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 4న నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించే దిశగా సిబ్బంది అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సక్రమంగా విధులకు హాజరై సమన్వయంతో నిర్వహించాలన్నారు. రూరల్ నియోజవర్గానికి ఓట్ల లెక్కింపునకు 350 మంది సిబ్బంది, హమాలీలను నియమించామన్నారు. కౌంటింగ్ హాల్‌కు తప్పకుండా ఒక వీడియోగ్రాఫర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కౌంటింగ్ హాల్లో అభ్యర్థుల ఏజెంట్లకు కేటాయించిన టేబుళ్లను స్పష్టంగా సూచించి, వారికి పాసులు కూడా ఇస్తామన్నారు. ఎన్నికల సిబ్బంది కూడా విధిగా ఎన్నికల పాస్‌లు ధరించాలని తెలిపారు. ప్రతి రౌండ్‌కు సంబంధించిన డేటాను టేబుల్‌పై వేసిన తర్వాత, పోలైన ఓట్ల సంఖ్య ఓటరు టర్నౌట్ రిపోర్ట్‌కు క్రాస్ వెరిఫై చేసుకొని నిర్ధారించు కోవాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం కౌంటింగ్ టేబుల్‌లకు అందించాలని, వాటి క్రమ సంఖ్య క్రాస్ చెక్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు ఐ.సాయిబాబా, తహశీల్దార్లు వైవికె.అప్పారావు, బి.సుజాత, కొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

మానవత్వం చాటుకున్న కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరు డాక్టర్ కె.మాధవీలత మానవత్వాన్ని చాటుకున్నారు. విది నిర్వహణలో భాగంగా శనివారం మధురపూడి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గాడాల వద్ద రోడ్డుప్రమాదం జరిగినట్టు గుర్తించారు. వెంటనే వాహనాన్ని ఆపి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. వెంటనే 108 అంబులెన్సు రప్పించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి తరళించే ఏర్పాట్లను స్వయంగా దగ్గర ఉండి పర్యవేక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి యాక్సిడెంట్‌లో గాయాల పాలైన క్షతగాత్రులకు తగిన వైద్య సేవలు అందించాలని కలెక్టరు ఆదేశించారు.

కళ్యాణ మండపం స్వాధీనం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన కళ్యాణ మండపం 2018 నుంచి కోర్టు కేసులో ఉంది. కోర్టు నుంచి ఆదేశాలు రావడంతో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు మేడేపల్లి విజయరాజు, వి.సోమరాజు, ఉప కమిషనర్ కార్యాలయ పర్యవేక్షకులు సుబ్రహ్మణ్యం, తనిఖీదారు జి.సత్య వరప్రసాద్ సమక్షంలో ఓసూరి బాల నాగేశ్వరరావు దేవస్థానమునకు సుమారు మూడు కోట్ల రూపాయలు విలువ కలిగిన ఆస్తిని స్వాధీనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ఎం.రాధాకృష్ణ, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంపిణీకి 30,054 పాఠ్యపుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలంలో 2024-25 విద్యా సంవత్సరమునకు సంబంధించి 45 ప్రభుత్వ పాఠశాలలకు అవసరమయ్యే 45,075 పాఠ్య పుస్తకాలకు శనివారం నాటికి 30,054 పుస్తకాలు వచ్చాయి. 8, 9, 10 తరగతులకు సంబంధించి 22,270 పుస్తకాలు, ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ 7,814 పుస్తకాలు వచ్చాయని విద్యాశాఖ అధికారులు మాణిక్యం తిరుమలదాస్, కెఆర్‌ఎస్‌వివి.అప్పారావు తెలిపారు. విద్యా కానుకలో భాగంగా పుస్తకాలతో పాటూ విద్యార్థులకు బెల్టులు 3,479 అందాయని తెలిపారు. మిగిలిన పుస్తకాలు కూడా రెండు మూడురోజుల్లో వస్తాయన్నారు. పాఠశాలలు తెరిచే రోజునే వీటిని అందించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

డ్వాక్రా కార్యాలయంలో ఆడిట్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని డ్వాక్రా కార్యాలయంలో శనివారం ఆడిట్ జరిగిందని ఎంపిఎం నాగరాజు తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు డ్వాక్రాలో జరిగిన లావాదేవీలపై రికార్డులను ఆడిట్ బృందం పరిశీలించిందన్నారు. ఈ సందర్భంగా ఎపిఎం నాగరాజు మాట్లాడుతూ మండల పరిధిలో గల 53 గ్రామ సంఘాల మండల సమైక్య రికార్డులను పరిశీలించారన్నారు.

గోపాలపురంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - గోపాలపురం


గోపాలపురం బిసి కాలనీలో శనివారం కొవ్వూరు డిఎస్‌పి రామారావు, సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నాటు సారా నియంత్రణ, మద్యం అక్రమ రవాణా నివారణ, అనుమానితులు ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. నియంత్రణకు విశిష్ట కృషి చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా అనుమానితంగా తారసపడితే వారి వివరాలను సేకరించారు. ఎటువంటి పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ప్రశాంతంగా జీవించాలని, అనవసరంగా కేసుల్లో చిక్కుకొని జీవితాలను చీకటి చేసుకోవద్దని హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా సమస్యలు సృష్టించినా, గొడవలను ప్రేరేపించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సామరస్యంతో మెలగి గొడవలు లేకుండా ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేద్దామని తెలిపారు.

నేడు యథావిధిగా విద్యుత్ బిల్లుల కౌంటర్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లాలోని గల అన్ని విద్యుత్ రెవెన్యూ, కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు వసూళ్ల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు ఆదివారం కూడా కొనసాగుతాయని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ టివిఎస్ఎన్.మూర్తి తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు, ఎపిఇపిడిసిఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఎటిపి సెంటర్లలోనూ ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

కార్టూ'నిజం'



మాక్ డ్రిల్ నిర్వహించిన పోలీసులు

ప్రజాశక్తి-నల్లజర్ల

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం నల్లజర్ల బస్టాండ్ సమీపంలో పోలీసులు మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. రౌడీ మూకలు గడ్డి బొమ్మలు తగలబెట్టడంతో వారిని చెదరగొట్టేందుకు లాఠీఛార్జి జరిపారు. అయినప్పటికీ పరిస్థితి కంట్రోల్‌లోకి రాకపోవడంతో భాష్ప వాయువు ప్రయోగించారు. రౌడీలు రెచ్చిపోవడంతో గాలిలోకి కాల్పులు జరిపారు. దీంతో రౌడీ మూకలు చెల్లాచెదురయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు.



లాఠీఛార్జి



ఫైరింగ్



బాష్పవాయువుకు ప్రయోగం

ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంది

ప్రజాశక్తి-కడియం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అయిపోయినప్పటికీ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి వచ్చేనెల 6 వరకు కోడ్ అమల్లోనే ఉంటుందని అప్పటివరకు అధికారులు, ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు గ్రామాల్లో పర్యటించారు. సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల కోడ్‌పై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజ్‌మనోజ్ మాట్లాడుతూ పోలింగ్ పూర్తయినంత మాత్రాన ఎన్నికల కోడ్ రద్దు కాదన్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఈ కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎక్కడా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉండకూడదని సూచించారు. కౌంటింగ్ అనంతరం ఆకతాయిలు ఫ్లెక్సీలను పాడుచేయడం వంటి చర్యలు వల్ల శాంతి భద్రతలకు అంతరాయం కలుగుతుందనే ఉద్దేశంతో రాజకీయ నాయకుల ఫ్లెక్స్‌లు, జెండాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఎప్పటి మాదిరిగానే ఫ్లెక్స్‌లు, జెండాలు వంటివి లేకుండా ప్రతి గ్రామంలో పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

యువకుని మృతిపై దర్యాప్తు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక యువకుడు అనుమానాస్పద మృతి పై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని. వెలిచేరు గ్రామానికి చెందిన కైరం నాగ శ్రీనివాస్(34) ఈనెల 22న ఇంటి నుండి సాయంత్రం బయటకు వెళ్లాడు. అయితే అతను ఈ నెల 23న ఉదయం వెలిచేరి వద్ద మధ్య డెల్టా కాలువ గట్టుపై విగతజీవిగా పడివున్నాడు. దీంతో అతనిని తండ్రి పోతురాజు స్థానిక పిఎంపి వద్దకు తీసుకువెళ్లగా పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించాడు. ఈ ఘటనపై తండ్రి పోతురాజు తన కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని ఎవరో కావాలని హత్య చేసి ఉంటారని పోలీసులు ఫిర్యాదు చేశాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి గా కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాస్ ఫోన్ నెంబర్ నుంచి ఎవరికి ఫోన్ చేశారు. శ్రీనివాస్ కి ఎంతమంది ఆరోజు ఫోన్ చేశారు. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఒంటిపై గాయాలు లేకపోవడం. షర్టు తడిసి ఉండడం. ముఖమంతా శుభ్రంగా ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై డాగ్ స్క్వాడ్ క్లూ టీమ్స్ కూడా వచ్చి పలు ఆధారాలను సేకరించినట్లు తెలుస్తుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పాటి చెరువుకి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు సమీపంలో చోటు చేసుకున్న సంఘటనపై పోలీసు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన తాళ్ల సతీష్ కుమార్ (36) ట్యూషన్ మాస్టర్ గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ఇంటి వద్ద మోటార్ సైకిల్ పై బయలుదేరాడు. అయితే గుడికి వెళ్లే మార్గం మధ్యలో మండలంలోని పాటి చెరువు సమీపంలోకి వచ్చేసరికి ఆర్ అండ్ బి రోడ్డుపై ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం సతీష్‌కుమార్ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతనికి గాయాలు అయ్యాయి. వెంటనే అతనిని 108 లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నాన్న ప్రసాదరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - గోపాలపురం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సారా బట్టీపై దాడులు నిర్వహించి వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వాదాలకుంట గ్రామం శివారు తాడిపూడి పంట కాలువ గట్టు వద్ద అదే గ్రామానికి చెందిన గుబ్బల శ్రీను సారాబట్టీని నిర్వహిస్తున్నాడన్నారు. ఈ మేరకు సిబ్బందితో దాడి చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రూ.20వేల విలువ గల 400 లీటర్ల బెల్లపు ఊట, సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కొవ్వూరు కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేట రామాలయంలో ఓ దుండగుడు శుక్రవారం అర్ధరాత్రి ఆలయ తలుపులు బద్దలు కొట్టి చోరీ చేస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. ఎవరూ లేని సమయంలో ఆలయ తలుపులు బద్దలు కొట్టి హుండీలో డబ్బులు దొంగతనం చేస్తుండగా పకడ్బందీగా పట్టుకున్నట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తనను పోలీసులకు అప్పగించామన్నారు. వెంటనే స్పందించిన పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షాలతో ఊరట.. అభ్యర్థుల్లో అలజడి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గత నెల రోజులుగా భానుడి ప్రతాపానికి అల్లాడిన ప్రజలకు ఈ వారాంతంలో మారిన వాతావరణం కాస్తంత ఊరట నిచ్చింది. పల్లెలు, పట్టణాలలో సామాన్య ప్రజానీకంతోపాటు పాడి రైతులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. జీవాలకు ఊరట లభించిందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ద్రోణి తుపానుగా మారడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఒక్క రోజు ముందుగానే వస్తున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిన విషయం విదితమే. తాజా వర్షాల నేపథ్యంలో కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. తూర్పు గోదావరి జిల్లాలో వరికోతలు ఈ నెల ప్రారంభంలోనే పూర్తవటంతో కొంత ఊరట లభించినట్లయింది. మిగిలిన రెండు జిల్లాల్లో కళ్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రభావంతో కొనుగోలు లక్ష్యం చేరుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. దీంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మద్దతు ధరకు తక్కువగా ధాన్యం విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతులకు అండగా నిలవాలని రైతులు, రైతు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇంకో వైపు వర్షాలు ముందుగానే రావటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవటంతో సాగు సందడిమొదలైంది.



ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా కేంద్రాలలో చక చకా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కౌంటింగ్ సిబ్బందికీ ఇప్పటికే అవగాహన కల్పించడంతో గడువు తేదీ రావటమే తరువాయి. మరోవైపు అభ్యర్థుల్లో సామాన్య ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైసిపి, టిడిపి తరుపున పోటీ చేసిన అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు సుమారు రూ.50 కోట్లతో మొదలై రూ.100 కోట్ల వరకూ వెచ్చించారు. పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు ఇక సరేసరి. రూ.100 కోట్లకుపైగానే ఖర్చు చేసినట్లు సమాచారం. ముఖ్యంగా జనసేనాని పవన్ కళ్యాణ్ పోటీ చేసిన పిఠాపురం నియోజకవర్గంలో అభ్యర్థుల ఖర్చు మరింత అదనమనే తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గెలుపు ఓటముల మధ్య అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటర్లలోనూ ఫలితాలపై జోరుగా చర్చ మొదలైంది. ఏ పార్టీ అధికారంలోకి రాబోతోందనే ఉత్సుకత వ్యక్తమవుతోంది. అయితే స్పష్టత రావాలంటే మరో 10 రోజులు ఆగాల్సిందే.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిక్కుళ్ల కేజీ రూ.100 మార్కు దాటేసింది. మిర్చి కేజీ రూ.80కు చేరాయి. వంకాయలు, బీర, ఇతర ఏ రకమైనా కేజీ రూ.60 వెచ్చించాల్సిందే. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేక రైతు బజార్లకు వెళ్లిన కొనుగోలు దారులకు నిరాశే మిగులుతోంది. కూరగాయల నాణ్యత లేకపోవటంతో రైతు బజార్ల లక్ష్యం నీరు కారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని కొనుగోలు దారులు కోరుతున్నారు.

అడ్మిషన్ల దందా షురూ

విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలలో అడ్మిషన్ల దందా మొదలైంది. ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా తూట్లు పడుతున్నాయి. ఎల్‌కెజి విద్యార్థికి కనీసంగా రూ.20,000 ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, బస్‌ఛార్జీల పేరుతో మరో రూ.10,000 యథేచ్ఛగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. పదో తరగతి చదివించాలంటే పాఠశాలల స్థాయిని బట్టి రూ.50,000 నుంచి రూ.1,00,000 వెచ్చించక తప్పడం లేదు. ఇంటర్మీడియెట్ కాలేజీ ఫీజులు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. నీట్, టార్గెట్ ఐఐటి తదితర పేర్లతో రూ.1,00,000 నుంచి రూ.1.50,000 చొప్పన వసూళ్లు జరుగుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తీవ్ర ఉక్కబోతతో ఆక్వాకు కష్టాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

నైరుతి పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, రెమాల్ తుపాను కారణంగా వాతావరణంలో తీవ్ర ఉక్కబోత వల్ల ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కుండపోత వర్షం కురిసినప్పటికి, శనివారం ఉదయం నుంచి వర్షం పడకుండా చిన్న చినుకు పడుతూ, గాలి స్తంభించి ఎండ రాకపోవడంతో రొయ్యల చెరువులకు ఆక్సిజన్ ప్రాబ్లం వచ్చి రొయ్యలు నీటిపై తేలుతూ ఈదడంవల్ల పలు చెరువుల్లో రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాళ్లరేవు మత్స్య శాఖ అధికారి గోపి మాట్లాడుతూ ఇటువంటి ఉక్క బోత సమయంలో చెరువుల్లో ఏరియేటర్స్ నిరంతరం పని చేయాలని సూచించారు. వాటర్ క్వాలిటీని పరీక్షించి పిహెచ్ (ఉదజని) శాతం 7.5 నుంచి 8.5 ఉండేలా చూసుకోవాలన్నారు. ఉదజని సూచికలో ఆమ్ల, క్షార స్థాయి ఏ విధంగా ఉన్నాయో చూసి దానికి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎండ లేకపోవడం వల్ల ఫొటోసింథసిస్ (కిరణ జన్య సంయోగ క్రియ) జరగకపోవడంతో చెరువులకు ఆక్సిజన్ ప్రాబ్లం వస్తుందని తెలిపారు. ఇటువంటి సమయంలో ఏరియేటర్స్‌ను కంటిన్యూగా తిప్పాలని అన్నారు. ఏరియేటర్స్ లేని రైతులు నీరు తోడే మోటారు, డీజిల్ ఇంజన్ సాయంతో చెరువులో నీటిని పంపింగ్ చేయాలన్నారు. ఆ సదుపాయం లేని రైతులు వాటర్ బోటు, లేదా మేత పెట్టే తెప్ప సాయంతో చెరువులో కొద్దిసేపు తిరిగినా ఆక్సిజన్ లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. కౌంటింగ్ దశకు వచ్చిన రొయ్యలను కొంతమేర వేటాడి తీసివేసిన, చెరువులో డెన్సిటీ తగ్గి మరునాడు డిఒ రాకుండా ఉంటుందని తెలిపారు. ఈ చర్యలు చేపట్టి ఉక్క బోత నుంచి రొయ్యల చెరువులను కాపాడుకోవచ్చని అన్నారు. వాతావరణం రెండు రోజులపాటు ఇలానే ఉంటే ఆక్సిజన్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.



ఆక్వా చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్స్

ఆధునిక విధానాలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పెద్దాపురం

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం డీన్ రమణమూర్తి తెలిపారు. వడ్లమూరులోని కమ్యూనిటీ భవనంలో శనివారం రైతులకు నిర్వహించిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పరికరాలను వినియోగించడంలో రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. పలువురు వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన అనేక అంశాలపై, నాణ్యమైన విత్తనాల ఎంపికపై, ఎరువుల సద్వినియోగంపై, చీడపీడల నివారణపై, అధిక దిగుబడులు సాధించడంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో గ్రామ రైతుల తరపున కంటే వీరరాఘవరావు పలు సమస్యలను అధికారులకు నివేదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోదావరి జోన్ అసోసియేట్ డీన్ ఆఫ్ రీసెర్చ్ శ్రీనివాస్, దయాకర్, ఉషారాణి, సుధీర్, సీతారామ శర్మ, వడ్లమూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీవాణి ప్రసంగించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యాన రఘు సౌజన్యంతో శనివారం వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ పరులకు చేతనైనంత మేరకు సేవలు అందిస్తే అంతకంటే మహత్కార్యం ఏముంటుందని ప్రశ్నించారు. పరోపకార గుణంతో జీవిస్తేనే జీవితం సార్థకం అవుతుందని అన్నారు. ఆ దిశగా సంపాదనలో కొంత శాతాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్న రఘు పేదలకు నూతన వస్త్రాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, రాఘవరావు, చంద్రరావు, కుమార రాజా తదితరులు పాల్గొన్నారు.



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వస్త్రాల పంపిణీ



పిల్లలను గుర్తించిన అధికారులు

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి -కరప

కరప మండలం వేళంగిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ సర్వేను ఐఇఆర్‌పిలు నిర్వహించారు. శనివారం ఈ సర్వే అమలు తీరును పరిశీలించేందుకు సర్వ శిక్షాభియాన్ ఐఇ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒ పి.సత్యనారాయణ సర్వేలో పాల్గొన్నారు. ఐఇఆర్‌పిలు, కన్నె స్వాతి, నురుకుర్తి మల్లీశ్వరికి సూచనలు సలహాలు అందించారు. వేళంగి గ్రామంలో మచ్చ వివేక్, తేజ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు ఎంఇఒవ సత్యనారాయణ తెలిపారు. మండలంలో 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను కరప మండల భవిత కేంద్రంలో తప్పనిసరిగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పలుచోట్ల తడిచిన ధాన్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం

అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు రైతులు దాచుకున్న ధాన్యం తడిసిపోయింది. వర్షాలు మరింతగా కురుస్తాయన్న సమాచారంతో రైతుల అప్రమత్తమయ్యారు. ధాన్యం రాశులపై పలు రైతులు బరకాలు కప్పుకోగా, ఎగుమతులు వేగం పెంచారు. దీంతో ట్రాక్టర్ల పై తర్పాలిన్ కవర్లు కప్పి ధాన్యం మిల్లులకు ఎగుమతులు వేగంగా జరుగుతున్నాయి. ఇక మొదట్లో 75 కేజీల బొండల ధాన్యానికి రూ.1400 చెల్లించగా ప్రస్తుతం రూ.1600 చేరుకుంది. ధాన్యం ధర పెరగడంతో రైతులు ధాన్యాన్ని ఎగుమతులు చేస్తున్నారు. మరోవైపు రోడ్ల వెంబడి పోగు చేసుకున్న ధాన్యాన్ని రైతులు బరకాలు, టార్పాలిన్లు కప్పి జాగ్రత్త చేసుకుంటున్నారు.



వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం



విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలో పలు పాఠశాల్లో డిఇఒ పి.రమేష్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా విద్యా కానుకకు సంబంధించి మల్లేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే ప్రతి ఒక్క విద్యార్థికి విద్యా కానుక కిట్లు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ కెహెచ్.నాయక్‌ను సూచించారు. నాడు-నేడు పనులకు సంబంధించి జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం జి.సుధా మాధురి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల, విద్యా బోధన పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంఇఒ కెహెచ్.నాయక్, కె.వెంకటరెడ్డి ఉన్నారు.

కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సంబంధిత సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ముఖ్యంగా సిబ్బంది పూర్తిగా అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఇవిఎం లెక్కింపు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా సెల్‌ఫోన్‌లు అనుమతించబోరని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు, కౌంటింగ్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు బి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో థైరాయిడ్ సమస్య

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

థైరాయిడ్ మెడ ముందు భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఏర్పడుతుందని, అయోడిన్ లోపం థైరాయిడ్ సమస్యకు ప్రధాన కారణమని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ థైరాయిడ్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. థైరాయిడ్ సమస్య వల్ల బరువు పెరగడం లేదా తగ్గడం, నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం, ఉద్వేగం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కనబడతాయని అన్నారు. పెద్దవారిలో జీవ క్రియలను థైరాయిడ్ హార్మోన్లు నియంత్రిస్తాయని అన్నారు. ఇలా అన్ని దశలలో థైరాయిడ్ చాలా కీలకమని అన్నారు. అయోడిన్ కలిగిన ఉప్పును ఉపయోగించాలని, నూనె పదార్థాలను పరిమితంగా తీసుకోవాలని, తప్పనిసరిగా వ్యాయామం చేయాలని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సిహెచ్. వెంకట్రావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

3 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-రామచంద్రపురం

శివల గ్రామం లో శనివారం 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఇక్కడ గల శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు గ్రామస్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. శివల, గుడిగల్ల తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమం లో ఇళ్ళ సూర్య నారాయణ, వీరబ్రహ్మం తదితరప్రముఖులు పాల్గొన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వర్షాలు ప్రారంభమై రెండు రోజులు గడవక ముందే కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 ఉండే పచ్చిమిర్చి ఒకేసారి కిలో రూ. 200 కు చేరింది. అదే బాటలో కొత్తిమీర మొన్నటి వరకు కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య ఉండగా ప్రస్తుతం కిలో 200 అమ్ముతున్నారు. దీంతోపాటుగా బీరకాయలు కిలో రూ.100కు చేరగా, వంకాయలు, బెండకాయలు కూడా కిలో రూ.60 నుంచి రూ.80 మధ్య ధర పలుకుతున్నాయి. ఒక్క ఉల్లిపాయలు టమాటాలు తప్ప మిగిలిన అన్ని సరుకులు ధరలు పెరిగాయి. అల్లం ధర కూడా సామాన్యులకు అందుబాటులో లేదు. వాటి వెంటే ఆకుకూరల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. బయట మార్కెట్ ధరలను అదుపు చేసే యంత్రాంగం ప్రభుత్వానికి లేకపోవడంతో ధరలు నియంత్రణ లేకుండా పోయింది రైతులు వద్ద తక్కువ ధరలకే కొంటున్న దళారులు అధిక మొత్తంలో లాభాలు వేసుకుని సామాన్యుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో లేని ధరలు వీలైనంత వరకు తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వెంకన్న ఆదాయం రూ.35 లక్షలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వివిధ సేవల ద్వారా శనివారం రూ.35 లక్షల వరకు ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వామివారికి వేకువ జామున సుప్రభాత సేవ, తొలి హారతి నిరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాల అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారన్నారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాన్ని కూడా అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి పర్యవేక్షించారు అలాగే శనివారం స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నదానం, విరాళాలు, లడ్డువిక్రయం, తదితర సేవలు వల్ల రూ.35 లక్షలు వరకు ఆదాయం సమకూరిందని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు జరగకుండా ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చిన యాత్రికులకు ప్రసాద వితరణ, భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు.


మందేశ్వరస్వామి ఆదాయం రూ.2 లక్షల 27 వేలు

కొత్తపేట: మందేశ్వర స్వామి ఆలయములో స్వామివారికి తైలాభిషేకములు, పూజలు, ప్రసాద వితరణ ద్వారా రూ.2,02,770 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ మరియు ఇఒ కె.విజయలక్ష్మి శనివారం తెలిపారు మందేశ్వర స్వామికి తైలాభిషేకములు ద్వారా రూ.1,65,065, అన్న ప్రసాదం విరాళాలుగా రూ.37,705 ఆదాయం వచ్చిందని తెలిపారు. సుమారు 400 మంది పైబడి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించాలని తెలిపారు.

మరమ్మతు పనులతో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి- సామర్లకోట

మండలంలని అచ్చంపేట, ఉండూరు సమీపంలో కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన పైపులైన్ మరమ్మతు పనుల కారణంగా శనివారం ఎడిబి రోడ్డులో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అచ్చంపేట సమీపంలో కూలిన వంతెన వద్ద రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాటర్ పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. శుక్రవారం పైపులైన్ మరమ్మతు ఎ న ం ల న ం ప్రారంభించారు. శనివారం ఒకవైపు వర్షం పడుతుండగా మరోవైపు పైప్ లైన్ మరమ్మతులు చేస్తుండడంతో భారీ క్రేన్ల వల్ల ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సామర్లకోట నుంచి కాకినాడ పోర్ట్ వైపు కాకినాడ పోర్ట్ నుండి సామర్లకోట వైపు భారీగా లారీలు కార్లు నిలిచిపోయాయి. సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వెళ్ళే ముడినీటి సరఫరా పైపులైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. ఒకవైపు ఎడిబి రోడ్డు నాలుగులైన్ల రహదారి అభివద్ధి పనులు మరోవైపు పైప్ లైన్ పనులతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



ఎడిబి రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

అచ్చంపేట వంతెన వద్ద పైప్‌లైన్ మరమ్మతులు

